శబరితో నీవు నన్ను చాలా ప్రేమగా చూసావు, నేను వెళ్ళిపోతున్నాను అని చెప్పాడు. మీతోపాటు నేను కూడా వచ్చేస్తాను అని శబరి చెప్పింది. నేను వెళ్ళేచోటు ఇద్దరం కలిసి వెళ్ళేదికాదు, అక్కడకు ఏకాంతంగా వెళ్ళవలసిందే. నువ్వు నాకంటే అదృష్టవంతురాలివి. ఎందుకంటే నేను వెళ్ళి దేవుడిని వెతుక్కోవాలి కాని నువ్వు దేవుడిని వెతుక్కోనక్కరలేదు, ఈ శరీరం ఉండగానే, నువ్వు ఈ భూమి మీద ఉండగానే దేవుడు నిన్ను వెతుక్కొంటూ వస్తాడు అని గురువుగారు శబరితో చెప్పారు. శబరి యొక్క భాగ్యం అది. శబరికి సొంత దుఃఖం లేదు కానీ గృహపరిత్యాగం చేసింది. బుద్ధుడికి సొంత దుఃఖం లేదు కాని గృహపరిత్యాగం చేసాడు. వారు ఉత్తమోత్తములు, మహోన్నతులు. అప్పుడు అలా చేసాను లాభం వచ్చింది. ఇప్పుడు ఇలా చేసాను నష్టం వచ్చింది అనుకొంటే లోపల కర్తృత్వం ఉంది. కర్తృత్వం ఉన్నంతకాలం బంధం విడిచిపెట్టదు. బంధం పోకుండా మోక్షం రాదు. ఎక్కడైతే అజ్ఞానం ఉందో అక్కడ దుఃఖం వచ్చి తీరుతుంది. మీరు సాధన చేసేటప్పుడు ఒక్కటే గమ్యంగా పెట్టుకోండి. మనం రోజూ ఇల్లు ఎలా తుడుచు కొంటున్నామో అలాగ సాధన పేరు మీద లోపల ఉన్న అజ్ఞానాన్ని అంతా తుడుచుకోండి. అజ్ఞానం పోకుండా జ్ఞానం రాదు. భక్తివలన మన కోరికలు నెరవేరుతున్నాయా లేదా అనేది ముఖ్యం కాదు. భక్తిలో నీ మనస్సు కరగాలి. కారణం లేకుండా ఈశ్వరుని పాదాలమీద మీకు ప్రేమ కుదురుతూ ఉంటే, అకారణభక్తి కలుగుతూ ఉంటే మీ మనస్సు కరిగిపోతుంది. మనస్సు నశిస్తేనేగాని మన హృదయంలో ఉన్న శాంతి, ఆనందం మనకు అనుభవంలోనికి రాదు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 2-11-08, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

నేనుని పోగొట్టుకోమని భగవాన్ చెపుతున్నారు. ఓం నమో భగవతే శ్రీరమణాయ అనుకునేటప్పటికి నేనుని పోగొట్టుకోమనే మాట గుర్తుకు వస్తాంది, మరి నేనుపోతే ఎలాగ? నేను ఉండాలి కదా అని నాకు ఈ మధ్యన భయం కలుగుతోంది అని ఒక అమ్మగారు అడుగుతున్నారు. మీరు అడిగింది న్యాయమే. ఆ నేనును మీరు పోగొట్టుకోవద్దు. రాముడి దగ్గర ఆంజనేయస్వామి ఎలా సేవాభావంతోటి ఉన్నాడో అలాగే ఈ నేనును భగవంతుడికి సేవకుడు అనుకోండి. మీరు ఇంటి దగ్గర ఏ పని చేసినా అది భగవంతుడి పని అనుకొని చెయ్యండి అని నేను చెప్పాను. మీరు చెప్పింది బాగుంది. నేను రేపటినుంచి అలాగే చేస్తాను అని చెప్పారు. అహంకారం లేకుండా మనిషి ఉండడు. అహంకారం లేకపోతే వాడు భగవంతుడు

అయిపోతాడు. మనిషి పుణ్యం చేసినా, పాపం చేసినా అహంకారం కోసమే చేస్తాడు. మన హృదయంలో పరమాత్మ ఉన్నాడు. ఆయనకి శరీరం అక్కరలేదు. మనం నేను, నేను అంటున్నాము కదా. ఆ నేనుకి శరీరం కావాలి. మనిషి బతకటం కూడా ఆ నేను కోసమే బతుకుతాడు. మీ ఇంట్లో ఎవరైనా చనిపోతే ఆ నేనే ఏడుస్తుంది. మనం శాస్త్రం చదివితే ఆ నేను పోయినట్లు ఉంటుంది కాని ఇంకా బలపడుతుంది. ఆ నేను అనే తలంపే ముడి. ఆ ముడి తెగిపోకుండా ఎవరికీ బ్రహ్మజ్ఞానం కలుగదు. ఆ నేను ఉన్నంతసేపు పాతశవం పోతుంది. కొత్తశవం వచ్చేస్తూ ఉంటుంది. దానిని ఎవరూ ఆపుచేయలేరు. మనం శాస్త్రం చదివి ఆ నేనుని నువ్వు అబద్ధం కదా అని అడుగుతున్నాము. నేను నిజమే నువ్వు చదివిన పుస్తకం అబద్ధం అని అది చెబుతుంది. అదే మనం నిజం అనుకుంటున్నాము. మనం ఇలా అలవాటు పడిపోయాము. శాస్త్రంలో చెప్పిన మాటలు మనకు అనుభవంలో లేవు, ఈ నేను అనుభవంలో ఉంది కాబట్టి అది చెప్పింది నమ్ముతాము. శాస్త్రంలోనివి నమ్మం, నమ్మినట్లు నటిస్తాము. అనుభవంలో ఉన్న విషయం అనుభవంలో లేని విషయాన్ని గెంటేస్తుంది. మనం ఇంక గానుగెద్దులా వేసినచోటనే ఉంటాము. మన సాధనలు కూడా అంతే.

మనకి భగవంతుడి మీద గుణాలతో సంబంధం లేనటువంటి ప్రేమ ఉండాలి. మీ వాసనలతోటి, కోరికలుతోటి సంబంధం లేకుండా నూటికి నూరుపాళ్ళు మీకు భగవంతుడుపట్ల ప్రేమ కుదిరితే అప్పుడు మీకు ఆత్మజ్ఞానం వస్తుంది. మనకి గుణాలతో కూడిన ప్రేమలు ఉన్నాయి. సత్వగుణప్రేమ, రజోగుణప్రేమ, తమోగుణప్రేమ. గుణాలు మారేకొలది వాడి మనస్సు మారిపోతూ ఉంటుంది. సత్వగుణంలో ఉన్నప్పుడు ప్రశాంతంగా మాట్లాడతాడు. రజోగుణంలో ఉన్నప్పుడు చిరాకుగా, కోపంగా మాట్లాడుతాడు. తమోగుణంలో ఉన్నప్పుడు మనం చెప్పింది అసలు వినిపించుకోడు. గురువు మీద ఉన్న ప్రేమ సత్వగుణప్రేమ అదీ ప్రేమేకాని అందులో గుణం ఉంది. మనకి గుణాలు లేని ప్రేమ రావాలి. పాల్‌బ్రంటన్ ఇంగ్లండు దేశస్థుడు. పెద్ద రచయిత. ఆయన 1936లో కంచి పరమాచార్యులు చెప్పగా భగవాన్ దగ్గరకు వచ్చారు. నేను అనే తలంపే జీవుడు, వాడే మనస్సు, ఆ తలంపు నీ లోపల నుంచే వస్తోంది. ఆ మూల తలంపు దాని మూలం చూడకుండా అది నశించదు అని భగవాన్ చెప్పారు. అది బ్రంటన్‌కి నచ్చింది. ఎ సెర్చ్ ఇన్ సీక్రెట్ ఇండియా అనే బుక్కు ఇంగ్లీషులో వ్రాసాడు. అందులో 120 పేజీలు భగవాన్ గురించి వ్రాసాడు. ఆ పుస్తకానికి పెద్దపేరు వచ్చింది. ఆ పుస్తకం వ్రాయకముందు ఇతర దేశాలలో భగవాన్ గురించి ఎవరికి తెలియదు. ఆ పుస్తకం చాలామంది చదవటం

వలన రమణమహర్షి అరుణాచలంలో ఉన్నారని అందరికి తెలిసింది. ఆయన ఋషి అని తెలిసింది. హృదయంలో ఉన్న వస్తువుని ఉన్నది ఉన్నట్లుగా దర్శించినవాడు ఋషి. బ్రంటన్ భగవాన్ దగ్గరకి రెండవసారి వచ్చినప్పడు భగవాన్ చెప్పింది ఆయన వ్రాసుకొంటున్నాడు. భగవాన్ తమ్ముడు చూసి అక్కడ ఉన్న ప్రొఫెసర్‌గారితో ఆయన వ్రాసుకోవటానికి వీల్లేదు కావాలంటే వినమనండి అని చెప్పారు. ఆదే ఆయన బ్రంటన్‌తో చెప్పారు. బ్రంటన్ స్టన్ అయిపోయాడు. బ్రంటన్ భగవాన్ వైపు తిరిగి మీ తమ్ముడు వ్రాసుకోవద్దన్నాడు మీ ఉద్దేశ్యం కూడా అదేనా అని అడిగాడు. భగవాన్ ఏమి చెప్పకుండా మౌనంగా ఉండిపోయారు. ఈ ఆశ్రమం ఇలాగ ఉందేమిటి అని మరుసటిరోజు ఆశ్రమం వదిలి వెళ్ళిపోయాడు. భగవాన్ మీద అంతకు ముందు ఉన్న గౌరవం కంప్లీట్‌గా పోయింది. ఇది సత్వగుణప్రేమ. బ్రంటన్ అంతటివాడికే బుద్ధిమారిపోయింది. ఆయన గురువును ప్రేమించిన మాట నిజమే కాని ఆయన మనస్సుకు ఇష్టంలేని సంఘటన జరిగింది సడన్‌గా ఆ ప్రేమ అంతా ద్వేషంగా మారిపోయింది. గుణంతో కూడిన ప్రేమను నమ్మటానికి వీలులేదు. ఈ మూడు గుణాలు దాటిన ప్రేమ చిరకాలం, కలకాలం ఉంటుంది. భార్యభర్తల మధ్య ఉన్న ప్రేమ రజోగుణప్రేమ. పెళ్ళి అయిన కొత్తలో ఉన్న ప్రేమ ముసలివాళ్ళు అయిన తరువాత ఉండదు. ఒకరిని ఒకరు తిట్టుకుంటూ ఉంటారు. ఇది నూటికి నూరుపాళ్ళు అబద్ధం. మీ ఇంట్లో పనిమనిషి అమ్మగారు, అమ్మగారు అంటుంది. మీరు ఎప్పడైనా చిరాకుపడి నాలుగు నెలలు జీతం ఇవ్వకపోతే మిమ్మల్ని తిడుతుంది. ఇది తమోగుణ ప్రేమ. ఇవి అన్నీ మీ అనుభవంలో తెలుస్తూ ఉంటాయి, మీకు ఆత్మజ్ఞానం కలిగింది అనుకోండి వాడు పెద్దవాడా, చిన్నవాడా, మంచివాడా, చెడ్డవాడా అని ఈ కొలతలు లేకుండా సమానమైన ప్రేమ నిలబడుతుంది. ఇది ఆత్మ ప్రేమ. నిజమైన ప్రేమ ఆత్మలోంచి ప్రవహిస్తుంది.

సహనం ఉన్న మనిషికి గుండె యొక్క లోతులు పెరుగుతాయి. మన గుండె యొక్క లోతులు పెరగటం గెడ్డపార పెట్టి గొయ్యి తీసినంత తేలికకాదు. మనకి ఆత్మజ్ఞానం కలగాలంటే ప్రవర్తన సరిగా ఉండాలి. నీకు ఎవరైనా అధర్మం చేసినా నువ్వు ధర్మాన్ని విడిచిపెట్టకు. భగవంతుడిని తెలుసుకోవటానికి పనికి వచ్చే గ్రంధాలు చదువు. మంచి గ్రంధం చదవటం వలన ఎలా బాగుపడతామో, చెడ్డ గ్రంధం చదవటం వలన అలా పాడైపోతాము. నువ్వు గ్రంధం చదివి అర్ధం చేసుకొని దానిని ఎంజాయ్ చేస్తూ అది ఇతరులకు చెప్పటం వలన నీకు లాభం ఏమిటి అంటే, ఈ రోజు నాలుగు మంచి మాటలు చెప్పాను ఇవన్నీ చిలకపలుకులా లేకపోతే ఇందులో ఒక్కమాటైనా అనుభవంలో ఉందా అని ఇంటికి వెళ్ళిన తరువాత నీకు

ఆలోచన వస్తుంది. అనుభవంలో లేనివి నీ మనస్సు చెబుతుంది. అప్పడు వాటిని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి ప్రయత్నం చేస్తావు. అది చెప్పేవాడికి లాభం, విన్నవాళ్ళకి విన్నది లాభం. అంతా ఈశ్వరసంకల్పంతోటి నడుస్తోంది అంటున్నారు కదా? చదవటానికి బాగానే ఉందికాని దాని గురించి తెలియటంలేదేమిటి అని అడుగుతున్నారు. అది తెలియటానికి వంద జన్మలు సాధన చేస్తేకాని తెలియదు. ఆ వాక్యము నీకు అనుభవంలోనికి వస్తే బండెడు దుఃఖము ఉంటే బండెడు సుఖం క్రింద మారిపోతుంది. మీ ఋణం తీరటమేకాదు మళ్ళీ నిలవ క్రింద మారిపోతుంది. మీకు ఆత్మ ప్రేమ ఉంటే మీ తల్లిదండ్రులు చెడ్డవారైనా వారిని ప్రేమించటం మానరు. వారు చెడ్డవాళ్ళయితే మీకెందుకు, మీకు శరీరం ఇచ్చారు అందుకు వారిని ప్రేమించాలి, వారు చెడ్డవాళ్ళయితే భగవంతుడు చూసుకొంటాడు. మీకు ఆత్మ ప్రేమ లేదనుకోండి వారిని ప్రేమించటం మానేయటం కోసం ఏదో వంపు పెట్టుకొంటారు ఇది మాయ. ఎవరైనా చెడ్డవాళ్ళయితే వాళ్ళని మనం చెడ్డవాళ్ళు అంటాము కాని జ్ఞాని అలాగ అనడు. ఆ చెడ్డవాడిని మంచివాడి కింద మార్చి వాడికి ఆత్మజ్ఞానం ఎలాగ ఇవ్వాలి అని చూస్తాడు. అది జ్ఞాని యొక్క వైభవం. అది గుణాలు లేని ప్రేమ.

మనిషి తన స్వభావాన్ని మార్చుకోవటం చాలా కష్టం అని పరమాత్మ గీతలో చెప్పాడు. నువ్వు బ్రతికి ఉండగా కాలిపోయి మళ్ళీ ఆ శరీరంలో పుడితే స్వభావం మారుతుంది. స్వభావం మార్చుకోవటం అంత కష్టం. నీ చదువుల వల్ల, నీ డబ్బు వల్ల స్వభావం మార్చుకోగలవా? ఎంతో కష్టపడి సాధన చేసినా స్వభావం మారుతుందని చెప్పలేము. మీ మీద మీరు యుద్ధం ప్రకటించుకుంటె అప్పడు స్వభావం మారుతుంది. మీరు స్వభావంలో మార్పు తెచ్చుకొంటే మీకు జ్ఞాననేత్రం కలుగుతుంది. బ్రాహ్మీస్థితి పొందటానికి దారి కనిపిస్తుంది. ఒక నది ఒడ్డున తేలు ఆవలి గట్టుకు వెళ్ళటానికి ఆలోచిస్తోంది. అంతలో ఒక తాబేలు ఒడ్డుకి వచ్చింది. ఓ తాబేలా! నేను ఈ నది ఆవలి ప్రక్కకు వెళ్ళాలి అనుకొంటున్నాను. నాకు ఈతరాదు. నువ్వు నాకు ఒక సహాయం చేయాలి. నేను నీ వీపుమీద కూర్చొంటాను నన్ను ఆ ప్రక్కన పెట్టేయి వెళ్ళిపోతాను అంది. నీ స్వభావం నాకు తెలుసు నీకు కుట్టే అలవాటు ఉంది నేను తీసుకొని వెళ్ళను అని తాబేలు అంది. నువ్వు నాకు ఉపకారం చేస్తున్నావు నిన్ను ఎందుకు కుడతాను అని తేలు చెప్పింది. తాబేలు తేలు మాటలు నమ్మి అయితే నా వీపు మీద కూర్చో ఆ ప్రక్కన దింపేస్తాను అంది. తేలు వీపు మీద కూర్చుంది, తాబేలు తీసుకువెడుతోంది. నది మధ్యలోకి వెళ్ళాక తేలుకు కుట్టాలనే బుద్ధి వచ్చేస్తోంది. మనం మాట ఇచ్చాము పైగా మనకి

ఉపకారం చేస్తోంది కుట్టకూడదు అనుకొంది అయినా కుట్టాలనిపిస్తోంది. అంతే కుట్టేసింది. అలవాట్ల యొక్క వేగం అటువంటిది. తాబేలు ఆ మంట భరించలేక తలకాయ నీటిలో పెట్టి కుదిపేసుకొంది, పైనున్న తేలు నీటిలో పడి కొట్టుకుపోతోంది. ఓ తేలా! నువ్వు నాకు ఇచ్చిన మాట ఏమిటి? నువ్వు చేసినదేమిటి? అని తాబేలు అడిగింది. ఓ తాబేలా నువ్వు చెప్పింది న్యాయముగానే ఉంది. కుట్టటం నా పొరపాటు, నీకు ఇచ్చిన మాట పోషించుకోలేకపోయాను అని తెలుస్తోంది నిన్ను కుట్టటం వలన నాకే నష్టం వచ్చింది కదా, అయినా కుట్టాలనే తలంపును జయించలేకపోయాను, ఇప్పడు నేను కొట్టుకొనిపోతున్నాను నా స్వభావం ముందు ఆ లాజిక్ ఏం చేస్తుంది అని చెప్పింది. మాటల కంటే అలవాట్లే ఎక్కువ వేగంగా పనిచేస్తాయి. మీ ముక్కులో గాలి బయటకు పోయేవరకు ఈ కథ జ్ఞాపకం పెట్టుకోవాలి. రకరకాల మనుష్యలు ఉంటారు. మీరు ఎవరికైనా వంద ఉపకారాలు చెయ్యండి కాని వాడు మీకు అపకారం చేయటం మానడు. మీరు ఉపకారం చేస్తున్నట్లు వాడికి తెలుస్తూ ఉంటుంది కాని అపకారం చెయ్యకుండ విడిచిపెట్టడు. అది వాడి స్వభావం. వాడు ఆ అలవాటుతో జన్మించాడు, అలవాటుతో ఉంటాడు, అలవాటుతో మరణిస్తాడు. మీరు ఇంటి దగ్గర కూర్చుని అధ్యయనం చేయటం వలన స్వభావం మారదు. నీతో నువ్వు పోరాడితే స్వభావం మారుతుంది కాని ఇతరులతో పోరాడితే స్వభావం మారదు.

మనకి దేహంతోటి, మనస్సుతోటి ఎంతకాలమైతే తాదాత్మ్యం ఉందో అంతకాలం లోపలఉన్న సత్యం మనకి ఎరుకలోనికి రాదు. సత్పురుషుల సహవాసం, సద్గ్రంథపఠనం, తీర్థయాత్రలు వీటన్నిటియొక్క ప్రయోజనం ఏమిటి అంటే మనస్సుని అంతర్ముఖం చేయటమే. మనస్సు అంతర్ముఖం అవ్వకపోతే ఆత్మజ్ఞానం కలగదు, ఆత్మజ్ఞానం కలగకపోతే వాడికి మోక్షం లేదు. మీకు మంచి పని చేసే శక్తి ఉంటే చెయ్యండి, చేసే శక్తి మీకు లేకపోతే చేసేవాళ్ళని చూసి సంతోషించండి. పనిచేసి ఫలితం ఎపుడు వస్తుందని కనిపెట్టుకొని ఉంటే మన బుద్ధి పాడైపోతుంది. సత్కర్మ నిష్కామంగా చెయ్యాలి. సత్కర్మ చేస్తూ ఉండాలి, కోరిక ఉండకూడదు. అప్పడు చిత్తశుద్ధి కలుగుతుంది. చిత్తశుద్ధి లేకుండా ప్రపంచంలో ఇంతవరకూ ఎవరికి జ్ఞానం కలుగలేదు. లోపల ఉన్న వస్తువు ఎంత శుద్ధంగా ఉందో మన మనస్సు కూడా అంత పరిశుద్ధమైతేనే గాని అది మనకు తెలియబడదు. ఈలోపుగా తెలియబడిన మనం భరించలేము. బ్రహ్మం నీలోపలే ఉంది దానిని తెలుసుకోవటానికి తగిన అర్హత, యోగ్యత నీకు ఉన్నాయా అని చూసుకొంటోంది. ఆ అర్హత, యోగ్యత నీకు వచ్చినప్పడు ఒక్కక్షణం కూడా ఆలస్యం చెయ్యకుండా

అది నీకు తెలియబడుతుంది.

నేను సృష్టికి ఉపకారం చెయ్యాలనుకొంటున్నాను అని ఒకరు భగవాన్‌ని అడిగితే ముందు నువ్వు ఆత్మజ్ఞానం సంపాదించు అపుడు నీ ద్వారా సృష్టికి ఉపకారం జరుగుతుంది. దానికి మించిన ఉపకారం లేదు అన్నారు. జ్ఞానం వల్ల వచ్చే సుఖంగాని, శాంతిగాని, ఆనందంగాని ఈ లోకవిషయాలతోటి పోల్చటానికి వీలులేదు. మనకి కుంటితనం ఉంటే ఆ కుంటితనం ఎలా అవకరమో అలాగే ఈ మనస్సు అనేది ఒక అవకరం. ఈ అవకరం వదిలించుకొనేదాకా మనకి ఆత్మజ్ఞానం కలుగదు. మనస్సుని నాశనం చేసుకోవటం ఎలాగ, అక్కడే భయమేస్తోంది అని అడుగుతున్నారు. మనస్సే నువ్వు అనుకోవటం వలన దానిని తొలిగించుకోమంటే నీకు భయమేస్తుంది. నీకు జాగ్రదావస్థలో, స్వప్నావస్థలో మనస్సు ఉంది. కాని గాఢనిద్రలో మనస్సు గొడవ లేదు. మనస్సే నిజమైతే గాఢనిద్రలో అది ఎందుకు లేదు. మనకి గాఢనిద్ర గురువు. గాఢనిద్రలో చావుగొడవ, పుట్టుకగొడవ, దేహంగొడవ, మనస్సు గొడవ లేదు కాని మనం ఉన్నాము. గాఢనిద్రలో దుఃఖ స్పర్శ లేకుండా మనం సుఖంగా ఉన్నాము. ఆ స్థితిని జాగ్రదావస్థలో మనం ఎరుకలోనికి తెచ్చుకోవాలి. మనస్సుకి చాపల్యం ఎక్కువ. మనలని జపం ఎందుకు చెయ్యమన్నారంటే మన ఇష్టదైవం యొక్క నామాన్ని నిరంతరం జపిస్తూ ఉంటే మనస్సుకి చాపల్యం తగ్గుతుంది. దానికి లోచూపు కలుగుతుంది, లోచూపు కలిగాక జ్ఞానసముపార్జనపట్ల ఇష్టం కలుగుతుంది అందుకు జపం చెయ్యమన్నారు. ఇతరులు మిమ్మల్ని పొగిడితే అది లోపలకు తీసుకుంటె అది అంతా దుఃఖంకింద మారిపోతుంది. మిమ్మల్ని మీరు పొగుడుకోవటం ఎంత పొరపాటో, ఇతరులు మిమ్మల్ని పొగుడుతూ ఉంటే శ్రద్ధగా వినటం కూడా అంతే పొరపాటు. ఇతరులు పొగిడితే అది కీర్తి. జ్ఞానం లేనప్పుడు కీర్తి ఏమి చేసుకొంటాము. మీరు ఏదో ఒక రంగంలో అభివృద్ధిలోకి వస్తున్నారు అనుకోండి అలా అభివృద్ధిలోనికి రావటం సంఘం ఒప్పకోదు అది మాయ. మీ కాళ్ళు పట్టుకొని లాగేయటానికి చూస్తారు. అప్పడు తట్టుకోవాలి, సంఘం ఇలా అణిచేస్తోందని సంఘం మీద ద్వేషం పెట్టుకోకూడదు. ఇవన్నీ మీరు తట్టుకోగల్గితే ఆత్మజ్ఞానానికి అర్హత సంపాదిస్తారు.

నువ్వు ధర్మబద్ధమైన జీవితం జీవించటం కోసం భగవంతుడి పాదాలు ఆశ్రయించు. శాస్త్రాన్ని పట్టుకొని ఉండు, నీ అహంకారం ఎలా చెబితే అలా గంతులెయ్యకు. నీకు అవకాశం ఉన్నంత వరకు ధర్మాన్ని ఆచరించు. నీ కుటుంబ సభ్యులుకాని, నువ్వు సంపాదించిన డబ్బుకాని

నువ్వు మరణించిన తరువాత నీ కూడా రాదు. మరణించిన తరువాత నీ కూడా ధర్మం వస్తుంది. మౌనం అంటే భగవాన్‌కు ఇష్టం. మౌనం కూడా మాట్లాడుతుంది అనేవారు. మాట చెప్పాలంటే మనకి నోరు ఉండాలి. మౌనానికి నోరు అక్కర్లేదు. మనస్సుకి చాపల్యం ఆగిపోగానే అది హృదయంలో అణిగిపోతుంది. అక్కడ మౌనస్థితి కలుగుతుంది. ఆ మౌనం మీ హృదయానికి చెప్పవలసిన సందేశం చెప్తుంది. అక్కడ మాటలు ఉండవు. హృదయం హృదయంతోటి మాట్లాడేటప్పడు మాటలతో పని ఏముంది? సైగలతోటి పని ఏముంది అన్నారు భగవాన్. అది మౌన భాష. మీరు ఇక్కడ ఉండి అమెరికాలో ఉన్నవారి క్షేమం కోరుకుంటున్నారనుకోండి ఆ తలంపుకి దూరంలేదు, ఆ తలంపు అమెరికాలో కూడా పని చేస్తుంది. మంచి తలంపుకే అంత శక్తి ఉన్నప్పుడు ఆత్మశక్తి ఇంక ఎంత బలీయమైనది. మీరు జ్ఞాని దగ్గర కూర్చున్నప్పడు మీ కష్టాలు మర్చిపోయి శాంతిగా ఉంటారు. జ్ఞానియొక్క మాటలు కంటే ఆయన మౌనం మీ మనస్సులో తొందరగా మార్పు తీసుకువస్తుంది. మీకు మారుమనస్సు కలుగుతుంది. ఉపయోగంలేని అలవాట్లు ఉంటే వాటిని తొలగించి ఉపయోగపడే అలవాట్లు తీసుకువచ్చేది జ్ఞాని యొక్క మౌనం.

కోరికను ఎక్కువసార్లు నెరవేర్చుకొంటూ ఉంటే దానిని అలవాటు అంటారు. ఆ అలవాట్లు బలపడిపోతూ ఉంటే వాటిలోంచి వాసనలు వస్తాయి. ఈ వాసనలు మనస్సుని పట్టుకొని మన శరీరం చనిపోయిన తరువాత కూడా వచ్చేసి కొత్త శరీరంలో ప్రవేశిస్తాయి. భౌతిక పదార్థాలు ఏమీ మనకూడా రావు. ఆ మనస్సునే జీవుడు అంటాము. ఆ జీవుడిని శరీరం వదిలి బయటకు వెళ్ళమంటే వెళ్ళడు. ఆ శరీరంలో ఎన్ని అనుభవాలు పొందాలో అన్ని అనుభవాలు పొందితేగాని ఆ శరీరాన్ని, జీవుడిని సెపరేట్ చెయ్యలేము. భగవంతుడు ఆ ముక్కులో గాలిపోసినప్పడే మరల ఆ ముక్కులో గాలి ఎప్పడు తీసివేయాలో నిర్ణయిస్తాడు. మనం ఎక్కువకాలం బతకాలని అనుకొన్నా ఒక గంటకాలం ఎక్కువ బతకము, చావు ఎప్పడు వస్తుందా అని కనిపెట్టుకొని ఉంటే ఒక గంటముందు వెళ్ళము. మన వల్ల ఏమీ అవ్వదు. భగవాన్‌ని చూడటానికి రాధాకృష్ణన్‌గారు వచ్చేవారు. ఆయన మహా పండితుడు. భగవాన్‌ని ఆయన ఎప్పడూ ఒక్క ప్రశ్న అడగలేదు. మిమ్మల్ని చూడటానికి వస్తున్నారు మిమ్మల్ని ఏమీ అడగకుండా వెళ్ళిపోతున్నారు ఏమిటి అని భగవాన్‌ని అడిగితే ఆయనకు అన్నీ తెలుసు, తెలుసున్నవాడు ఏమి అడుగుతాడు అన్నారు. భగవాన్ గురించి మీ అభిప్రాయం ఏమిటి అని రాధాకృష్ణన్‌గారిని అడిగితే ఆయన లైట్‌హౌస్ అన్నారు. సముద్రంలో ఉన్న

ఓడలకు ఇది ఒడ్డు అని తెలియటం కోసం లైటుహౌస్ ఎలా ఉపయోగపడుతుందో అలాగ బ్రాహ్మీస్థితిని పొందినవాడు ఎలాగ ఉంటాడో తెలియటం కోసం ఆయన మనకు ఉపయోగపడుతున్నారు అని రాధాకృష్ణన్ చెప్పారు. భౌతికమైన ఉపకారం మంచిదేగాని అవి తాత్కాలికాలు. మన మనస్సు ఎంత నిజమో ఆ ఉపకారాలు కూడా అంతే నిజం. నీ లోపలున్న సద్వస్తువు అనుభవంలోనికి తెచ్చుకుంటే నీ ద్వారా వేలాది మంది బాగుపడతారు. దానికి మించిన ఉపకారం లేదు. చేతిలో డబ్బు ఉంటే బజారులో ఉన్న వస్తువు కొనుక్కోవటం ఎంత తేలికో మన స్వభావాన్ని, అలవాట్లని మార్చుకోకల్గితే ఆత్మజ్ఞానసముపార్జన కూడా అంతే తేలిక. మనకి ఆత్మజ్ఞానం కలిగేవరకూ దేహము నేను అనే బుద్ధిలోనుండి బయటకు రాలేము. భగవంతుడు ఏమి చేస్తాడు అంటే దూడని కట్రాడుకి ఎలా కట్టేస్తామో అలాగ ప్రతీ జన్మలో ఏదొక శరీరానికి మనలను కట్టేస్తూ ఉంటాడు. ఆ శరీరానికి మంచి జరిగితే మంచని, చెడ్డ జరిగితే చెడ్డని ఇలా జీవిస్తూ ఏదొక రోజున చనిపోతాము. ఎన్ని గ్రంధాలు చదివినా దేహము నేను అనే తలంపులోనుండి బయటకు రాలేకపోతున్నాము. ఈ మాయలోనుండి బయటకు రావటం చాలా కష్టం. దైవానుగ్రహం ఉన్నవాడు కాని ఇందులోనుండి బయటకు రాలేడు. అంతవరకు మనకి తేలు బుద్ధిపోదు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 12-7-08, తాడేపల్లిగూడెం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

సాధారణంగా మనలో ఆలోచన తక్కువగా ఉంటుంది, అనుకరణ ఎక్కువగా ఉంటుంది. పదిమంది ఏ పని చేస్తే ఆ పని చేస్తూ ఉంటాము, సొంత ఆలోచన ఉన్నవారు చాలా తక్కువగా ఉంటారు. మనుషులు అందరూ గొఱ్ఱెల వంటివారు అని బుద్ధుడు అన్నాడు. ఒకసారి గొఱ్ఱెల మంద వెళుతోంది, ఎదురుగా పెద్ద గొయ్యి ఉంది. ముందుగా వెళ్ళే గొఱ్ఱె చూసుకోకుండా వెళ్ళి ఆ గొయ్యిలో పడిపోయింది. అది ప్రమాదవశాత్తు గోతిలో పడిపోయింది అని మిగతా గొఱ్ఱెలకు అర్థంకాలేదు. అక్కడ ఏదో మేత ఉంది, తినటానికి వెళ్ళిపోయింది, మనం కూడా తినేద్దాము అని మిగిలిన గొఱ్ఱెలు కూడా వెళ్ళి ఆ గోతిలో పడిపోయినాయి. మన పరిస్థితి కూడా అలాగే ఉంది. ఎవరో వస్తున్నారు అనుకోండి. అందరు ఎందుకు అలా గెంటుకొని రావటం. మీకు వినబడటం లేదు అనుకోండి, వినపడటం లేదు అని చెప్పవచ్చు. ఎక్కడ కూర్చొన్నా ఒక్కటే. గురువు దగ్గరకాని, ఈశ్వరుడి దగ్గర కాని బలవంతాన ఎవరూ మోక్షం పుచ్చుకోలేరు.